# ఫ్యాక్షన్లు - ప్రజా ఉద్యమాలు

వేంపెంట మారణకాండ గురించి అర్ధ సత్యాలతో (పూర్తి అసత్యాలతో అనలేము) రిపోర్ట్ చేసిన అంశాలను విమర్శిస్తూ పత్రికలలో రాసిన వారిపై ఇప్పుడు రెండు విచిత్రమైన అభియోగాలతో ఒక ప్రచారం నడుస్తున్నది. ఒకటి, వాళ్ళు బుడ్డా వెంగళరెడ్డి గురించి ఏం మాట్లాడడం లేదనీ, రెండు ఊచకోతలో చనిపోయిన దళిత బహుజనుల పట్ల వాళ్ళు కనీస మానవత్వాన్ని ప్రదర్శించడం లేదని. ఈ ప్రచారం చేసే వాళ్ళకున్నంత పెద్ద వదంతుల యంత్రాంగం మాకు లేదు కాబట్టి దీనిని పూర్తిగా ఎదుర్కోవడం మాకు సాధ్యం కాదుగానీ ఎక్కడో ఒక చోట జవాబు చెప్పక తప్పదు.

మానవత్వం సంగతి ముందు మాట్లాడుకుందాం. రాయలసీమ ఫ్యాక్షన్ కొట్లాటలలో జరిగే హత్యలకు మానవత్వంతో స్పందించాలని వీళ్ళు కొత్తగా కనుక్కున్నారు. రాయలసీమలో ఫ్యాక్షన్ హత్యలు ఇప్పటికే వేలాదిగా జరిగాయి. వాటిలో ఎక్కువగా చనిపోయింది పేదలు, దళిత బహుజనులే. ఇప్పటిదాకా ఈ ప్రజా సంఘాలేవీ వాళ్ళ కోసం కన్నీళ్ళు పెట్టలేదు. వాళ్ళను ఎంత ఘోరంగా ఎంత క్రూరంగా చంపారో ఒక్కొక్క మృతుడినీ ఉదాహరణగా తీసుకొని హృదయ విదారకంగా వర్ణిస్తూ ఉపన్యాసాలు ఎన్నడూ ఇవ్వలేదు. వాళ్లను తిరిగి ఊరు చేర్పించే ప్రయత్నం చేయలేదు. వాళ్ళ హత్యకు నిరసనగా నెల్లూరు నుండి శ్రీకాకుళం దాకా టెంట్‌లు వేసి ధర్నాలు చేయలేదు.

నిన్నటి దాకా లేని 'మానవత్వం' ఈ రోజు పుట్టుకురావడానికి కారణం నిజమైన మానవత్వమూ కాదు, దళిత బహుజనుల పట్ల వారికున్న ప్రేమా కాదు. పీపుల్స్‌వార్‌కు దెబ్బతగిలిందనే వారిలో ఈ మేల్కొలుపు. ఎప్పుడో ఒకప్పుడు మేల్కొన్నారు కదా అంటే నాకేమీ అభ్యంతరం లేదుగానీ దానికి మానవత్వం అని పేరు పెట్టుకోకుండా ఉంటే మంచిది.

వేంపెంట మృతుల పట్ల - కేవలం ఒక పక్షం మృతుల పట్ల కాదు, మృతులందరి పట్ల సానుభూతి ఉంది కాబట్టే, తమ అనాలోచిత వైఖరి వల్ల ఇంతటి మారణకాండకు అవకాశం కల్పించిన వారినందరినీ విమర్శించడం అవసరం అని అనుకుంటున్నాం. రాయలసీమ ఫ్యాక్షన్ల గురించి కొత్తగా తెలుసుకుంటున్న వాళ్ళకు బుడ్డా వెంగళరెడ్డి మాత్రమే ఫ్యాక్షనిజానికి ప్రతినిధిగా కనిపిస్తాడు. కానీ నిజమైన సమస్య అతని ఫ్యాక్షనిజం కాదు, వై.ఎస్. రాజశేఖర రెడ్డి ఫ్యాక్షనిజం కాదు, పరిటాల రవి ఫ్యాక్షనిజం కాదు. నిజమైన సమస్య ప్రజలలో ఉన్న ఫ్యాక్షనిజం. ఫ్యాక్షన్ సంస్కృతి రాయలసీమ ప్రజాజీవిత సంస్కృతిలో భాగం. ప్రజలు కేవలం ఫ్యాక్షనిస్టుల చేత వాడుకోబడరు. వారంతటవారే తెలిసి తెలిసీ ఫ్యాక్షన్లలో భాగం అవుతారు. అప్పుడప్పుడు కొంత నిస్సహాయత దీనికి తోడవుతుంది. ఒక్కొక్కసారి అదే ప్రధానం కూడ కావచ్చు. కానీ చాలా భాగం తమ మధ్య ఉన్న చిన్నా పెద్ద కొట్లాటలను ఫ్యాక్షన్ పద్ధతిలో పరిష్కరించుకోవడానికీ, చిన్నా పెద్ద ప్రయోజనాలు పొందడానికీ తెలిసే ఫ్యాక్షన్లలో భాగం అవుతారు. (వీటిలో కొన్ని న్యాయమైన ప్రయోజనాలు కూడ ఉండవచ్చు.) ఒక రకంగా చెప్పాలంటే ఫ్యాక్షనిస్టులు ప్రజలను వాడుకున్నట్టే ప్రజలు కూడ ఫ్యాక్షనిస్టులను వాడుకుంటారు. ఎటొచ్చీ ఇది ఇరువైపులా సమానంగా ఉండదు. ఏ రకంగా వాడుకుంటారు, అది ఏ ఫలితాలకు దారితీస్తుంది, దాని నష్టాన్ని ఎవరు భరిస్తారు అనేది ఫ్యాక్షన్లలో భాగమయ్యే ప్రజలు కాదు ఫ్యాక్షనిస్టులు నిర్ణయిస్తారు. నష్టాన్ని భరించేది ఫ్యాక్షన్‌లలో భాగమయ్యే సామాన్య ప్రజలే కాని వారు 'అమాయక ప్రజలు' కారు. ఎక్కువ భాగం తెలిసీ తమ సంకుచిత ప్రయోజనాల కోసం (ఒక్కోసారి న్యాయమైన ప్రయోజనాల కోసం కూడ) లేక సంప్రదాయక అనుబంధాల వల్ల ఫ్యాక్షన్లలో భాగమై నష్టపోతారు. వీళ్ళు అత్యధిక భాగం పేదలు, లేదా దిగువ మధ్యతరగతికి చెందినవారు. దళిత బహుజన కులాలకు చెందినవారే కాక కొంత మేరకు చిన్న రైతులయిన రెడ్లు కూడ (ముఖ్యంగా కడప, తూర్పు కర్నూలు ప్రాంతాలలో) ఫ్యాక్షన్లకు బలి అవుతుంటారు. మూర్ఖత్వం వాళ్ళదే అయినా కూడ వాళ్ళు అనుభవించే నష్టం

- ముఖ్యంగా ఆ కుటుంబాల స్త్రీలు, పిల్లలు - అపారమైనది. మనకు మానవత్వం ఉంటే మనసును కరిగిస్తుంది. రాయలసీమ అనగానే బుడ్డా వెంగళరెడ్డి వంటి ఫ్యాక్షనిస్టులు మాత్రమే కనిపించేవారికి రాయలసీమ 'జూ'లోని వింత జంతువులా తోస్తుంది. ఫ్యాక్షనిస్టులను ద్వేషించడం నేర్చుకుంటే చాలుననిపిస్తుంది. కానీ ఫ్యాక్షనిజం గురించి ఏం చేయాలో నిజంగా తెలియాలంటే కేవలం రాయలసీమ ఫ్యాక్షనిస్టుల మీద ద్వేషం ఉంటే చాలదు, రాయలసీమపైన కొంచెం ప్రేమ కూడ ఉండాలి. తమ మూర్ఖపు సంస్కృతి వల్ల తెలిసీ ఫ్యాక్షన్లలో భాగమై అపారంగా నష్టపోతున్న ప్రజల పట్ల - పేదలు, దళితులు, నిరక్షరాస్యులు, 'పౌరుషం' 'మగతనం' 'ప్రతిష్ఠ' వంటివి గొప్ప గుణాలని భావించే సంస్కృతికి బానిసలైన ప్రజల పట్ల - కొంచెం సానుభూతి ఉండాలి. తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఫ్యాక్షన్ మృతుల పట్ల ప్రేమను కొత్తగా అలవరచుకున్న వాళ్ళకు ఈ మానవత్వం అర్థం కాదు.

ఈ మానవతా దృష్టితోనే వేంపెంట దుర్ఘటనల్లాంటివి మళ్ళీ జరగకుండా ఉండాలంటే ఆ గ్రామంలో కమ్యూనిస్టులు చేసిన తప్పుల గురించి మాట్లాడాలని మేము భావిస్తున్నాం. ఫ్యాక్షనిజానికి ప్రస్తుతం ఏ పేద ప్రజలు బలి అవుతున్నారో ఫ్యాక్షనిజాన్ని హింసాత్మకంగా ఎదుర్కొనే విప్లవ కమ్యూనిస్టు వ్యూహంలో కూడ మళ్ళీ ఆ పేద ప్రజలే బలి అవుతారు. బలప్రయోగంతో సమాజంపైన ఆధిపత్యం నెలకొల్పడానికి గుంపుకట్టి దౌర్జన్యాలకు పాల్పడడం ఫ్యాక్షనిజం లక్షణం. ఎం.ఎల్ పార్టీలు అనుసరిస్తున్న వ్యూహంలో కూడ బలప్రయోగంతో సమాజంపైన ఆధిపత్యం నెలకొల్పడానికి ప్రజలను కూడగట్టే గుణం ప్రధానమైనది. రెండు వ్యూహాలలోనూ పేద, పీడిత ప్రజలు, దళిత బహుజనులు కీలక పాత్ర నిర్వహిస్తారు. అయితే ఎం.ఎల్ పార్టీల వ్యూహంలో వారి ప్రయోజనాలకు గుర్తింపు, వారి సమస్యలకు పరిష్కారం దొరుకుతాయి. (వేంపెంటలో దళితులకు, ముఖ్యంగా మాదిగలకు దొరికినట్టు.) ఈ తేడాను గుర్తించవలసిందే. దీనికి ఎం.ఎల్ పార్టీలను గౌరవించవలసిందే. అయితే ఇది ఆధిక్యతా వ్యూహంలో భాగంగా జరగడం వల్ల, ఎంతో జాగ్రత్తగా ఉండకపోతే ఇది కూడ ఫ్యాక్షనిజానికి దారితీయగలదు. వేంపెంటలో జరిగింది అదే. ఫ్యాక్షనిస్టుల పద్ధతులకూ ఎం.ఎల్ పార్టీల వ్యూహానికీ చాలా మౌలికమైన తేడా ఉన్నట్టు సిద్ధాంత చర్చలో అనిపిస్తుంది. కానీ రాయలసీమ ఫ్యాక్షన్ సంస్కృతిలో రెండవది చాలా సులభంగా మొదటిదానిగా రూపాంతరం చెందగలదు. రాయలసీమను అర్థం చేసుకోవాలంటే వర్గ విశ్లేషణ, కుల విశ్లేషణ సరిపోవు. ముఠాకక్షల సంస్కృతిని కూడ అర్థం చేసుకోవాలి. ఆ సంస్కృతిలో వర్గ

పోరాట వ్యూహాలయినా, కుల పోరాట వ్యూహాలయినా ప్రముఖంగా హింసాత్మక రూపం ఎంచుకున్నప్పుడు ఏ రకంగా రూపాంతరం చెందుతాయో అర్థం చేసుకోవాలి. రాయలసీమలో హింస గురించి ప్రత్యేకంగా అప్రమత్తంగా ఉండాలి. ఇక్కడ హింసాత్మక చర్య ఒకసారి మొదలయితే అది ఒక వలయంగా మారి డజన్ల ప్రాణాలు తీయగలదు. ఆ ప్రాణాలన్నీ పేదల, దళిత బహుజనుల ప్రాణాలే అవుతాయి. మనకు నిజమైన మానవత్వం ఉంటే ఈ చావుల గురించి ఆవేదన చెందాలి. చచ్చిపోయిన తరువాత ఆందోళన చేసి సానుభూతిని పోగుచేసుకోవడం కాదు.

ఇది 'అనివార్యం' అనీ, రాయలసీమలో విప్లవోద్యమం చాలా రక్తసిక్తంగా ఉంటుందనీ, చచ్చిపోయే ప్రజలు తమ భవిష్యత్తు కోసమే చచ్చిపోతున్నట్టు భావించాలనీ కొంతమంది వాదిస్తున్నారు. పీపుల్స్‌వార్‌ను విమర్శిస్తున్నవాళ్లు అదే స్థానంలో ఉంటే అంతకంటే వేరే ఏమీ చేయలేరని వాదిస్తున్నారు. పీపుల్స్‌వార్ వ్యూహం తప్ప వేరే వ్యూహం ఎవ్వరూ అనుసరించలేరనుకున్నా శివయ్య హత్య ఎంతవరకు 'అవసరం' అనేది ప్రశ్నార్థకమే. పీపుల్స్‌వార్ అనుచరులయిన పేదల, దళితుల ప్రయోజనాలకు శివయ్య హత్య అవసరమా? లేక గ్రామంపైన పీపుల్స్‌వార్ పెత్తనాన్ని అప్రతిహతంగా నెలకొల్పడానికి అవసరమా? మాజీ పీపుల్స్‌వార్ (ప్రస్తుతం 'ప్రతిఘటన') నక్సలైట్ నాయకుడు అయిన స్వర్ణ పుల్లయ్య నాయకత్వంలో జాన్‌ను కిడ్నాప్ చేసి దేవరాజ్‌ను చంపింది పీపుల్స్‌వారేనని అతని చేత దౌర్జన్యంగా చెప్పించిన చర్యే శివయ్య హత్యకు ప్రత్యక్ష పూర్వరంగం. ఆ చర్యవల్లనే పీపుల్స్‌వార్ ఆధిక్యత దెబ్బతినింది కాబట్టి దానిని తిరిగి నెలకొల్పడానికి ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇది నూటికి నూరుపాళ్ళు ఫ్యాక్షనిస్టు ఆలోచన. అయితే మాల దళితుడైన స్వర్ణ పుల్లయ్యను చంపితే ఒక ఎం.ఎల్ పార్టీ దళిత నాయకుడిని చంపినట్టవుతుందని భావించి ఆ ప్రయత్నం మానుకుని అతనికి బదులు అతనితో మిలాఖత్ అయిన అగ్రకుల పాలకవర్గ బుడ్డా వెంగళరెడ్డి ముఠా అనుచరుడైన బొమ్మ శివయ్యను చంపారు. ఈ నిర్ణయం కూడ ఫ్యాక్షనిస్టు స్వభావం ఉన్న నిర్ణయమే. బొమ్మ శివయ్య హత్య నిజానికి స్వర్ణ పుల్లయ్యకు హెచ్చరిక అని స్వర్ణ పుల్లయ్య అనుచరులు సరిగ్గానే అర్థం చేసుకున్నారు. కాబట్టే శివయ్య అనుచరులతో పాటు వాళ్ళు కూడ రెచ్చిపోయి పీపుల్స్‌వార్ అనుచరులపైన హింసాత్మకంగా దాడి చేశారు. ఆద్యంతం ఫ్యాక్షన్ స్వభావం గల ఈ ఉదంతం 'అనివార్యమా?'.

అంతకు ముందు పీపుల్స్‌వార్ ఆ గ్రామంలో దేవాదాయ భూముల విషయంలో అమలు చేసిన విధానం, మాదిగలకు గ్రామ వ్యవహారాలలో

ప్రాముఖ్యం ఇవ్వడానికి చేసిన ప్రయత్నం హర్షణీయమైనదే. అంతమాత్రం చేత వేంపెంట ఘటన అనివార్యమైనదని భావించాలా? ఆ గ్రామంలో మాల - మాదిగల ఘర్షణ ఫ్యాక్షన్ రూపం తీసుకోకుండా నివారించలేకపోవడం ఒక వైఫల్యమైతే, జాన్ కిడ్నాప్‌కు ఫ్యాక్షన్ పద్ధతిలో ప్రతీకారం తీర్చుకోవాలన్న పీపుల్స్‌వార్ నిర్ణయం ఫ్యాక్షన్ ఘర్షణను పెంచి బలహీనులయిన ప్రజలను హింసకు గురిచేసే నిర్ణయమే తప్ప 'అనివార్యం' కాదు.

అంతేకాదు తెలంగాణలో అనుసరిస్తున్న సాయుధ పోరాట వ్యూహం రాయలసీమకు తగినదేనా? అన్న ప్రశ్న కూడ వేసుకోవాలి. దీని అర్థం సాయుధ పోరాట వ్యూహం తెలంగాణకు తగినదే అని కాదు. ఆ చర్చలోకి పోవడానికిది సందర్భం కాదు. ఇతరత్రా అది సరయిన వ్యూహమేననుకున్నా రాయలసీమ వంటి (బలప్రయోగంతో ఆధిక్యతను నిలబెట్టుకునే సంస్కృతి ప్రబలంగా ఉన్న) ప్రాంతాలలో దానిని అమలు చేస్తే రాగల ఫలితాలను దృష్టిలో పెట్టుకుని అది రాయలసీమకు ఎంతవరకు సమంజసమనేది ఆలోచించాలి. ఇక్కడ ఆ వ్యూహం త్వరలోనే కొత్త ఫ్యాక్షన్లకు దారితీయగలదు. లేదా పాత ఫ్యాక్షన్లకు కొత్త రూపం ఇవ్వగలదు. ఇరుపక్షాలూ మొండిగా పోతే ఒక హింసాత్మక వలయాన్ని సృష్టించి విపరీతమైన మారణకాండకు దారితీయగలదు. ఎందుకంటే ఎం.ఎల్ పార్టీల సాయుధ పోరాట ఆచరణకూ, ఫ్యాక్షన్ల ఆచరణకూ కొన్ని ముఖ్యమైన పోలికలున్నాయి. ఈ మారణకాండలో ఇరువైపులా పేద, పీడిత ప్రజానీకం ఇరుక్కొని ప్రాణాలు పోగొట్టుకొనే ప్రమాదం, కుటుంబాలు నాశనం అయ్యే ప్రమాదం ఉంటుంది. మధ్య మధ్యలో మంచి ఏమీ జరగదని కాదు. భూస్వామ్య వర్గానికి వ్యతిరేకంగా భూమి పోరాటాలూ, కూలి పోరాటాలూ, గ్రామాలలో పెత్తందారీ కులాల, వర్గాల నిర్ణయమే శిరోధార్యమన్న ఆచారంపైన పోరాటాలూ సాగుతుంటాయి. కానీ వాటి వల్ల వచ్చే ఫలితం ఫ్యాక్షన్ వాతావరణంలో నిలకడగా ఉండదు. ఒకవేళ ఉన్నా, ఆ ఫలితం కోసం ఇంతటి నష్టం భరించవలసిందేనా? ఇదంతా పుడమితల్లి పురిటినొప్పుల లాంటిదని కవితలల్లి సులభంగా కొట్టిపారేయగలమా?

మరేం చేయాలి అని అడుగుతారేమో! రాయలసీమలో భూస్వాముల ఫ్యాక్షన్లను ఎదుర్కొనదలచుకున్న వారు ప్రజలలో ఫ్యాక్షనిజాన్ని పోగొట్టే మార్గాలు మొదట అన్వేషించాలి. అన్వేషించకపోగా తాము ప్రజలలో ఫ్యాక్షనిజం మరింత పెరగడానికి కారణమై, చివరికి తాము కూడ ఫ్యాక్షన్‌లో ఇరుక్కున్నందుకే పీపుల్స్‌వార్‌నూ, ప్రతిఘటననూ విమర్శించింది. వేంపెంటలో ఇరువైపులా చచ్చింది

దళిత బహుజనులే, చంపిందీ దళిత బహుజనులే. ఒకరు బుడ్డా వెంగళరెడ్డి భూస్వామ్య ముఠా ఏజెంట్లు అని, మరొకరు విప్లవ ప్రజానీకం అని వర్గీకరించుకోవడం మన ఆత్మవంచనకు తప్ప ఇంకెందుకూ పనికిరాదు. అవతలివైపు వారికి బుడ్డా వెంగళరెడ్డి ముఠా సపోర్టు ఉన్నమాట సత్యమే కావచ్చుగానీ వాళ్ళు కేవలం అగ్రకుల భూస్వాముల, ఫ్యాక్షనిస్టుల 'కుట్రలకు' బలి అయిన అమాయకులు కారు. ఉద్దేశ్యపూర్వకంగా, తమ ఆధిపత్య ప్రయోజనాల కోసం అందులో భాగమైనవారే. దీనిని పోగొట్టే ఆలోచన, విధానం ఏమీ లేకుండా, 'ఇక్కడ ప్రజల మధ్య ఘర్షణ ఉందనడం అబద్ధం, అందులో పార్టీలు భాగమై పోయాయనడం అబద్ధం' అంటూ బుడ్డా వెంగళరెడ్డి కుట్రలను ఎండగట్టే ఏకైక కార్యక్రమం చేపట్టి ఆందోళన చేస్తే ఎన్ని శతాబ్దాలు ఆందోళన చేసినా ఫ్యాక్షనిజం మీద పోరాటం ఒక్క అంగుళం కూడ ముందుకు కదలదు. ప్రజా సంఘాలకు నిరంతరం ఆందోళనలు చేయడానికి కావలసిన ఘటనలు మాత్రం జరుగుతూనే ఉంటాయి. బుడ్డా వెంగళరెడ్లు ఎప్పుడూ ఉంటారు, వాళ్లకు వ్యతిరేకంగా మన టెంట్లూ, ధర్నాలూ ఎప్పుడూ జరుగుతూనే ఉంటాయి.

ప్రజలలో ఉన్న ఫ్యాక్షన్ సంస్కృతిని పోగొట్టే కార్యక్రమం కేవలం ఒకానొక పాక్షికమైన పని కాదు, అదొక ప్రధానమైన రాజకీయ కృషి కావాలి. అంతవరకూ భూమి పోరాటాలూ, కూలి పోరాటాలూ చేయొద్దని కాదు. కానీ వాటికిచ్చే ప్రాధాన్యత కంటే (బహుశా అంతకంటే ఎక్కువ ప్రాధాన్యత) ఈ కృషికి ఇవ్వాలి. ఇది రాయలసీమ ప్రజాజీవితంలో ప్రబలంగా జీర్ణించుకుపోయి ఉన్న నైతిక సంస్కృతి పైన చేసే సాంస్కృతిక పోరాటం. ఒక సమస్యో, లేక ఒక వైరుధ్యమో ముందుకొచ్చినప్పుడు న్యాయాన్యాయాల వివేచన చేయకుండా కేవలం వాటి ప్రయోజనాల ప్రాతిపదికనే చూడడం; మన ప్రయోజనాలతో ముడిపడి ఉన్న ఇతర ప్రయోజనాలు (లేక మనతో ముడిపడి ఉన్న 'ఐడెంటిటీ') గల వాళ్ళతో గుంపు కట్టడం; ఆ గుంపు ద్వారా మన ప్రయోజనాన్ని కాపాడుకోవాలని చూడడం; దానికోసం దౌర్జన్యానికి పాల్పడడం; దౌర్జన్యం చేయగల సత్తా ఉన్న పెత్తందారును ఆశ్రయించడం; వాడి పెత్తనాన్ని పెంచి పోషించడం; వాడికి కాల్బలంగా ఉపయోగపడుతూ వాడి అనైతిక చర్యలలో పాలు పంచుకోవడం - ఇదీ ఫ్యాక్షన్ సంస్కృతి. కులవ్యవస్థ ఒక సహజమైన గుంపును సమకూరుస్తుంది కాబట్టి కులాల మధ్య సమస్యలు కూడ ఇక్కడ ఫ్యాక్షన్ సమస్యలుగా మారుతుంటాయి. అయితే ఫ్యాక్షన్ గుంపులు కులం గుంపులే కానవసరం లేదు. గ్రామం, గేరి, పార్టీ, ఒక పెత్తందారుతో ఉన్న సాన్నిహిత్యం -

ఏదైనా దానికి ప్రాతిపదిక కాగలదు. కనుక ఈ సంస్కృతిని మార్చే ప్రయత్నం చేయకుండా ఇక్కడ సాయుధ పోరాటం మొదలుపెడితే (దానివల్ల పేదలకూ పీడితులకూ కొన్ని ప్రయోజనాలు ఒనగూడినా) అది చాలా వేగంగా ఫ్యాక్షన్ కొట్లాటలకూ హింసాకాండకూ దిగజారగలదు. అనంతపురంలో సాయుధపోరాటానికి దిగిన పీపుల్స్‌వార్‌కు ఎదురైన చేదు అనుభవంలాగా ఆ పార్టీయే నాలుగు ఫ్యాక్షన్లుగా చీలగలదు.

మరేం చేయాలి అంటారేమో! ప్రజాజీవిత సంస్కృతిలోని అనైతికత పైన సాంస్కృతిక పోరాటం చేయాలి. ఏ సమస్య వచ్చినా ప్రయోజనం, ప్రతిష్ఠ, పెత్తనం కోసం చూడకుండా మంచి - చెడు, న్యాయం - అన్యాయం ప్రాతిపదికన చూడడం నేర్పించాలి. ఇది రాయలసీమ ప్రజలకు అసలే తెలీదని కాదు. కానీ ఇదే ప్రధాన సాంస్కృతిక లక్షణంగా ఉండవలసింది పోయి ఫ్యాక్షన్ సంస్కృతి ప్రధాన లక్షణంగా ఉంది. దానికి కారణమేమిటన్న చారిత్రక విశ్లేషణకి పూనుకోవడానికి ఇది సందర్భం కాదు గానీ, ఈ ప్రాధాన్యతలను తలక్రిందులు చేసే ఆచరణాత్మక కృషి ('కేవలం నీతి బోధ కాదు') ప్రజా ఉద్యమాల రాజకీయ కార్యాచరణలో కేంద్రస్థానంలో ఉండాలి. అది వదిలిపెట్టి 'ఇక్కడ ఇంతే, ఇక్కడ ఇట్లాగే జరుగుతుంది, ఇది అనివార్యం'! అనడం బాధ్యతా రాహిత్యం. రాయలసీమను 'జూ'లో జంతువును చూసినట్టు బయటినుండి చూసేవారికి ఈ బాధ్యతారాహిత్యం, దానివల్ల పోయే ప్రజల ప్రాణాలు, నాశనమయ్యే జీవితాలు చారిత్రక అనివార్యతగానూ, పుడమితల్లి పురిటి నొప్పులుగానూ తోచవచ్చు. కానీ దాన్నే అందరూ ఒప్పుకోవాలంటే కష్టం.

*అగస్టు 1998 కావొచ్చు*

*మొదట వార్త దినపత్రికలో అచ్చయి ఉండవచ్చు. ఉసా సంకలనం చేసిన 'దళిత రణన్నినాదం:1985-2005 దళితుల ఆత్మగౌరవ ప్రతిఘటనా పోరాటాల చరిత్ర' (ఎదురీత పబ్లికేషన్స్) పుస్తకంలోంచి తీసుకున్నాం.*